క్లుప్తంగా

'పొలం పిలుస్తోంది'తో రైతులకు మేలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సైంటిస్ట్ భవాని

మునగపాక: పొలం పిలుస్తోంది కార్యక్రమంతో రైతులకు మేలు జరుగుతుందని అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ భవాని తెలిపారు. నాగులాపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరి పంట పొలాలను పరిశీలించి రైతులకు సాగులో మంచి ఫలితాలు సాధించాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వరిలో తెగుళ్ల బెడద లేకుండా చూడాలన్నారు. రబీ సీజన్‌కు ముందు నువ్వులు, మొక్కజొన్న సాగుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్నకుమారి, వీఏఏ అనూష, రైతులు భీశెట్టి శేషు, గోవింద, పొలమరశెట్టి త్రినాథ్, చిన్న, సోమశేఖర్, కాండ్రేగుల నాగేశ్వరరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాల నివారణకు సహకరించండి



మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. మంగళవారం మండల పరిషత్ హాలులో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా కలిగే ప్రయోజనాలపై ఆయన మాట్లాడారు. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. ప్రతి సర్పంచ్, కార్యదర్శి ముందు జాగ్రత్తలో భాగంగా అవసరం మేరకు సీసీ కెమెరాలు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. మందు, మత్తు పదార్థాలకు బానిసయ్యే వారిని గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఈవోఆర్డీ సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

26న అనకాపల్లిలో మహా ధర్నా



పెదపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీఐటీయూ, రైతు సంఘం నాయకులు

అచ్యుతాపురం: అనకాపల్లిలో సీఐటీయూ, రైతు సంఘం నాయకులు ఈ నెల 26న మహా ధర్నా నిర్వహించనున్నట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము తెలిపారు. మహా ధర్నా కోసం రైతుల్లోనూ, కార్మికుల్లోనూ చైతన్యం తీసుకొచ్చేందుకు పెదపాడులో మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, బ్రహ్మాజీ, జనపరెడ్డి సత్యనారాయణ, వరలక్ష్మి, సముద్రాలు పాల్గొన్నారు.

అక్రమ కుళాయిలు తొలగించాలని వినతి



తోటాడ సచివాలయ ఉద్యోగులకు వినతిపత్రం అందిస్తున్న వార్డు సభ్యులు

మునగపాక: తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లిలో అక్రమ కుళాయి కనెక్షన్లను తొలగించాలని కోరుతూ మంగళవారం సచివాలయ ఉద్యోగులకు పలువురు వార్డు సభ్యులు వినతి పత్రం అందజేశారు. గతంలో ఇంటింటా కుళాయిలకు సంబంధించి పంచాయతీకి రూ.3 వేల మేర నగదు చెల్లించామన్నారు. అయితే గవర్ల అనకాపల్లిలో కొన్ని ఇళ్లకు రెండు నుంచి మూడేసి కుళాయి కనెక్షన్లు ఉన్నాయన్నారు. దీంతో పలు వీధుల్లో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో అక్రమ కుళాయి కనెక్షన్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వార్డు సభ్యులు వీరమణి, మహాలక్ష్మి, లలిత, పీఎంవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై కసరత్తు

నియోజకవర్గంలో ముసాయిదా జాబితా ప్రకారం ఓటర్ల వివరాలు			
మండలం పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
యలమంచిలి	27,150	29,500	856,658
రాంబిల్లి	20,485	21,650	042,135
మునగపాక	22,317	23,097	045,414
అచ్యుతాపురం	30,456	31,733	162,190
మొత్తం	1,00,408	1,05,980	92,06,397

నియోజకవర్గంలో మొత్తం పోలింగ్ కేంద్రాలు: 246

- యలమంచిలి నియోజకవర్గ ఓటర్లు 2,06,397
- తాజా లెక్కల ప్రకారం పెరిగిన ఓటర్ల సంఖ్య 2,286
- ఈ నెల 28 వరకు అభ్యంతరాల స్వీకరణ
- పోలింగ్ బూత్‌ల్లో ఈ నెల 23, 24 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు
- వచ్చే ఏడాది జనవరి 5న తుది జాబితా ప్రచురణ



యలమంచిలి తహసీల్దార్ కార్యాలయం ఎన్నికల విభాగంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ చేపడుతున్న సిబ్బంది

యలమంచిలి రూరల్: ఓటరు జాబితాల ప్రత్యేక సవరణలో భాగంగా ఇటీవల భారత ఎన్నికల సంఘం ముసాయిదా జాబితాను విడుదల చేసింది. కొత్త ఓటర్ల నమోదు, మృతుల పేర్ల తొలగింపులు, గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను తొలగించారు. సవరణలపై కసరత్తు అనంతరం ముసాయిదా జాబితాను నియోజకవర్గంలో 246 పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించారు. తాజా గణాంకాల ప్రకారం యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య పెరిగింది. గత మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 2,04,111 దీంతో పోలిస్తే ఇటీవల విడుదలైన ముసాయిదా జాబితా ప్రకారం నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 2,06,397. దీని ప్రకారం 2,286 మంది ఓటర్లు పెరిగారు. ఎలాంటి మార్పులు, చేర్పులు అవసరమైనా ఓటర్లు, రాజకీయ పార్టీల నాయకులు జాబితాలో సవరణను కోరేందుకు ముసాయిదా ఓటరు జాబితాను ఆయా పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు.

అభ్యంతరాల స్వీకరణ ఈ నెల 28 వరకు

అక్టోబరు 29న ముసాయిదా జాబితాను విడుదల చేసిన అధికారులు ఈ నెల 28 వరకు ప్రజల నుంచి, పార్టీల నుంచి అభ్యంతరాలను స్వీకరించనున్నారు. తాజాగా తయారు చేసిన జాబితాలో కేవలం కొత్తగా ఓటర్లను చేర్చడమే కాకుండా చిరునామా మారిన వారిని, చనిపోయిన వారి పేర్లను తొలగించారు. అంతేకాకుండా ఒకే నియోజకవర్గంలో 2 ఓట్లున్న వాటిలో ఒకటి జాబితా నుంచి తప్పించారు. అయితే ఈ క్రమంలో కొందరి పేర్లు గల్లంతు కావడమో, ఇక్కడే ఉన్నా జాబితా నుంచి తొలగిపోవడమో, చనిపోయినా ఇంకా జాబితాలో పేరుంటే తదితర అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకెళితే అవసరమైన మార్పులు చేస్తారు. అందు కోసం ఇప్పటికే ఓటున్నవారు తన ఓటు ఉందిలే అనే ధీమాతో ఉండకుండా సంబంధిత పోలింగ్ కేంద్రంలో జాబితాను చూసుకోవడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు. ఈ నెల 9,10 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించారు. మరోసారి ఈ నెల 23, 24 తేదీల్లో నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహించడానికి అధికారులు నిర్ణయించారు. ఈ రెండు రోజుల్లో ఆయా పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు ఓటర్లకు అందుబాటులో ఉంటారు. ఓటర్లు ముసాయిదా ఓటరు జాబితాలను పరిశీలించుకోవచ్చు. దీంతో పాటు 2025 జనవరి 1వ తేదీకి 18 సంవత్సరాలు నిండే యువత అంతా తమ పేర్లను జాబితాలో నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందుకోసం ఇంటింటికీ వెళ్లడంతో పాటు డిగ్రీ కళాశాలల్లో 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులను గుర్తించడానికి స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ముసాయిదా జాబితాలో తప్పులు, మార్పులు, తొలగింపుల సవరణ అనంతరం వచ్చే ఏడాది జనవరి 5న తుది జాబితా ప్రచురణ ఉంటుంది. తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పన కోసం అధికార యంత్రాంగం తీవ్ర కసరత్తు చేస్తోంది.



సోమలింగపాలెం పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితా సవరణ ప్రత్యేక శిబిరాన్ని పరిశీలిస్తున్న ఈఆర్వో కె.మనోరమ (ఫైల్)

కొత్తగా ఓటు హక్కు పొందవచ్చు..



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారంతా కొత్తగా హక్కు నమోదు చేసుకోవచ్చు. వాళ్లంతా ఈ నెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఓటరు నమోదుకు ఫారం-6, అభ్యంతరాలకు ఫారం-7, సవరణలకు ఫారం-8ను నింపాల్సి ఉంటుంది. ఓటరు నమోదుకు కళాశాలలు, రద్దీగా ఉండే కూడళ్లు, గ్రామాల్లో బీఎల్వోల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఓటరు జాబితాకు సంబంధించి ఎటువంటి అనుమానాలున్నా తహసీల్దార్ కార్యాలయాలు, బీఎల్వోలు లేదా నేరుగా తమ కార్యాలయంలో సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చు.

– కె మనోరమ, నియోజకవర్గ ఈఆర్వో

రైతుల అంగీకారంతోనే భూసేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌బాబు

ఎస్.రాయవరం: రైతుల అంగీకారంతోనే భూసేకరణ చేస్తామని, ప్రభుత్వ సర్వేయర్లు చేస్తున్న సర్వేతో ఆందోళన చెందవద్దని తహసీల్దార్ రమేష్ బాబు అన్నారు. గుర్రాజుపేట గ్రామంలో మంగళవారం రైతులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన రెండు రోజులుగా గుడివాడ రెవెన్యూ గుర్రాజుపేట గ్రామంలో 140, 139, 176, 151 తదితర సర్వే నంబర్ల నుంచి 206 వరకు సుమారు 529.92 ఎకరాలు భూమి వివరాలు తెలుసుకునేందుకు సర్వే చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. భూమిని గుర్తించిన తరువాత ప్రభుత్వానికి అవసరం ఉంటే నోటిఫికేషన్ విడుదల చేసి రైతులను ఒప్పించి తీసుకుంటారన్నారు. ఈ మేరకు రైతులు తమ భూముల్లో సర్వే ఎందుకు చేస్తున్నారో స్పష్టంగా తమకు తెలియపరిచి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి పనులు చేపడతామని తహసీల్దార్ చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు రామరాజు, చంటిరాజు, మధురాజు, శ్రీనివాసరావు, రమేష్, సీపీఎం నాయకులు ఎం.అప్పలరాజు, ఎం.సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి వైభవ వెంకన్న కల్యాణోత్సవాలు



వైభవ వేంకటేశ్వర స్వామి



కల్యాణోత్సవాలకు ముస్తాబైన ఆలయం

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో బుధవారం నుంచి వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. శనివారం వరకు జరిగే ఈ మహోత్సవాల కోసం చలువ పందిళ్లు, పుష్పాలు అలంకరణ, మాడవీధులు పరిశుభ్రత, చక్రస్నానానికి కోనేరులో ఏర్పాట్లు, కోలాటం, భరతనాట్యం ప్రదర్శనకు అవసరమైన వేదికల ఏర్పాటు చేశారు. సుమారు 500 మంది దంపతులు ఏకకాలంలో కూర్చుని స్వామి కల్యాణ మహోత్సవంలో పాలుపంచుకునేలా మండపాన్ని తీర్చిదిద్దారు. ఆలయ నిర్మాణం తరువాత స్వామివారికి 9వ వార్షిక కల్యాణం కావడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటలకు అంకురార్పణ కార్యక్రమంతో దివ్య లీలా కల్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయని చెప్పారు.

అంబరాన్నంటిన అంబలం పూజ



మునగపాక సంతబయిలులో అయ్యప్పస్వామి అంబలం పూజలో పాల్గొన్న స్వాములు



స్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: మండల కేంద్రం మునగపాకలోని సంతబయిలులో సోమవారం రాత్రి అయ్యప్పస్వామి అంబలం పూజ అంబరాన్నంటింది. గురుస్వామి వేగి రామకృష్ణ నేతృత్వంలో నిర్వహించిన అంబలం పూజలో ఆలపించిన గీతాలు అందరినీ భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. అయ్యప్ప నామస్మరణతో మునగపాక మార్మోగింది. ఈ అంబలం పూజకు పరిసర ప్రాంతాలకు చెందిన స్వాములు భారీగా తరలి వచ్చారు. స్వామిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, తదితరులు దర్శించుకున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



దిమిలి గ్రంథాలయం వద్ద ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



మునగపాక గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న పాఠకులు



పాయకరావుపేటలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో రంగవల్లికలతో విద్యార్థినులు

రాంబిల్లి(యలమంచిలి): గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు దోహదపడతాయని దిమిలి శాఖా గ్రంథాలయాధికారి శకుంతల అన్నారు. గ్రంథాలయంలో మంగళవారం వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ముగ్గులు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి విశ్రాంత ఉపాధ్యాయులు, పాఠకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటారు.

మునగపాక: మహిళలు చదువుతో పాటు అన్ని రంగాల్లోను రాణించాలని మునగపాక శాఖా గ్రంథాలయాధికారి రమణ ఆకాంక్షించారు. వారోత్సవాల సందర్భంగా మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా ఇందిరాగాంధీ చిత్ర పటం వద్ద పలువురు మహిళలు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఇందిరా గాంధీ, ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్ర పటాలకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్, విశ్రాంత ఉపాధ్యాయులు రత్నం, ఎస్.సీతారామమూర్తి, వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

కోటవురట్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం నిర్వహించిన రంగవల్లికల పోటీలో కేజీబీవీ, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింగరావు, లిబియా సుగంధిక, విజయదుర్గ, సామాల కిషోర్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎం.రాధారమణి, ఎస్.కుసుమ కుమారి, వై.లలిత, ఎస్.మాలక్ష్మినాయుడును సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వన సమారాధన

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి దక్షిణేశ్వరుని ఆలయ ప్రాంగణంలో మంగళవారం వనసమారాధన ఘనంగా జరిగింది. అనకాపల్లి గవరపాలెంలోని గౌరీ రైతు సంఘ అయ్యప్పస్వాములంతా దక్షిణేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త సూరిశెట్టి పరమేశ్వరరావును సంఘం సభ్యులు సత్కరించారు. సంఘం ఆశ్రమ గురుస్వామి మళ్ల నరసింగరావు, కాండ్రేగుల సీతారాం బాబ్జీ, బుద్ద శ్రీనివాసరావు, యల్లపు చక్రవర్తి, మద్దాల భోగలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఘనంగా ప్రపంచ టాయిలెట్స్ డే



క్లాప్ మిత్రులను సన్మానిస్తున్న సర్పంచ్‌లు, అధికారులు

పాయకరావుపేట: ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకోవాలని ఎంపీపీవో జయప్రకాష్‌రావు కోరారు. వరల్డ్ టాయిలెట్స్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. సత్యవరం గ్రామంలో క్లాప్ మిత్రులను సన్మానించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆరుబయట మలవిసర్జనకు స్వస్తి పలకాలి

మునగపాక: ఆరుబయట మల విసర్జనకు స్వస్తి పలకాలని, ఇందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి సూచించారు. మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులతో జరిగిన ప్రపంచ టాయిలెట్స్ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాదరావు, ఈవోఆర్డీ సోమరాజు, పాల్గొన్నారు.



మునగపాకలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

కోటవురట్ల: మండల పరిషత్ సిబ్బంది ఆధ్వర్యంలో టాయిలెట్ డే ను మంగళవారం నిర్వహించారు. చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ కార్యాలయం నుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఏవో చంద్రశేఖర్, సర్పంచ్ పైల శివ రామ్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు సన్మానం

నక్కపల్లి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకాన్ని అలవాటు చేసుకుని పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీవో సీతారామరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగభూషణం అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అన్ని సచివాలయాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. నక్కపల్లి పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఏడిద నూకరత్నం, కిల్లాడ రామకృష్ణ, స్థానిక నాయకులు అయినంపూడి మణిరాజు, అప్పలరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగభూషణం పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: ప్రపంచ టాయిలెట్ డే సందర్భంగా మంగళవారం మండలంలోని మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో విద్యార్థులు, అధికారులు, పంచాయతీ ఉద్యోగులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. టాయిలెట్ డే స్లోగన్లు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ గ్రామ వీధుల్లో ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను సర్పంచ్ భజంత్రీల లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కేఎస్ ప్రసాద్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరహాలు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



కోటవురట్లలో టాయిలెట్ డే ర్యాలీ చేస్తున్న మండల పరిషత్ సిబ్బంది



వేంపాడులో గ్రీన్ అంబాసిడర్లను సన్మానిస్తున్న అధికారులు



ఏటికొప్పాకలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రూ.62 కోట్లతో ఉపాధి పనులకు ప్రతిపాదనలు



ఉపాధి గ్రామసభలో చేపట్టిన పనులు చక్రం రూపంలో ముగ్గు ప్రదర్శన

ఎస్.రాయవరం: కర్రివానిపాలెంలో ఈ ఏడాది 14 కోట్ల 78 లక్షల 88 వేల రూపాయలు ఉపాధి నిధులు ఖర్చు చేశామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో జి.సత్యనారాయణ అన్నారు. కర్రివానిపాలెం గ్రామంలో గ్రామ సభ నిర్వహించి ఎన్ఆర్‌జీఎస్ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులవివరాలు తెలియజేశారు. మండలంలో 1246 మంది జాబ్ కార్డుదారులు ఉన్నారని, వీరంతా 100 రోజులు పని దినాలు ఉపయోగించుకుంటున్నారన్నారు. ఉపాధి పనులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, భవనాల నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. 2025-26 సంవత్సరానికి మండలంలో రూ.62 కోట్లతో పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ కర్రి హేమలత, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎస్.రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే సుందరపు వ్యాఖ్యలు గర్హనీయం'

అచ్యుతాపురం: గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ రాజ్ చట్టం గురించి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని జెడ్పీటీసీ సభ్యుడు నర్మాల కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే స్థానిక సమస్యలపై గళమెత్తడం మంచి పరిణామమని, అయినా పంచాయితీ రాజ్ గురించి వ్యాఖ్యానించడం సరికాదన్నారు. నియోజకవర్గంలోని సర్పంచులతో సంబంధం లేకుండా, ఎంపీపీలు, జెడ్పీటీసీలతో చర్చించకుండానే ఎన్ఆర్ఈజీఎస్ పనులు చేపట్టడంపై తామంతా అసంతృప్తితో ఉన్నామని తెలిపారు.

మానిపండు తెగులు నివారణకు చర్యలు



బోడపాలెంలో తెగుళ్లపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి సరోజిని

కోటవురట్ల: వరిలో అక్కడక్కడా మానిపండు తెగులు కనిపిస్తోందని, దీని నివారణకు రైతులు తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి బి.సరోజిని సూచించారు. మండలంలోని చినబొడ్డేపల్లి, బోడపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో వరి చేలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఏవో మాట్లాడుతూ అక్కడక్కడా వరిలో మానిపండు తెగులును గుర్తించామని, నివారణకు ప్రొఫికొనజోల్, అజక్సిస్ట్రోబిన్, టెబుకొనజోల్ మందును పిచికారీ చేయాలని సూచించారు. గింజ పొట్టే దశలో రెల్లు రాల్చే గొంగళి పురుగు రాత్రి పూట వెన్నులు కొరికి నష్టాన్ని కలగజేస్తుందని, దీని నివారణకు 200 లీటర్ల నీటిలో 60 ఎంఎల్ కోరాజెన్, లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి మినుములు, పెసలు విత్తనాలు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జీడి తోటలకు రూ.1540, మామిడి తోటలకు రూ.2200 చెల్లించి బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ టీఏ రామసూరి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మునగపాక: మండలంలోని నాగులాపల్లి సమీపంలో మంగళవారం సాయంత్రం పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభాన్ని ఓ లారీ ఢీకొంది. దీంతో ముందుగా వెళ్తున్న ఆటోపై ఆ స్తంభం పడిపోయింది. వివరాలిలా ఉన్నాయి. అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న లారీ నాగులాపల్లి సమీపంలో రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. అదే సమయంలో ప్రయాణికులతో వెళ్తున్న ఆటోపై స్తంభం పడడంతో అందరూ ఆందోళనకు గురయ్యారు. అయితే ఆటో కొంత మేర దెబ్బతింది. ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్తంభం పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఆ శాఖ ఏఈ గోపీ వచ్చి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.